# ★ ఊహాతీతులు ★

రచన : ఇచ్ఛాపురపు రామచంద్రం

"ఏమండీ, ఏదేనా సింగిల్ రూం రెంట్‌కి దొరుకుతుందా?" హిందూ పేపరు మొహానికడ్డంతీసి ఆయన నన్నుచూసేరు.. మెల్లగా నన్ను నేనే సెల్ఫ్ ఇంట్రొడ్యూస్ చేసుకున్నాను ..." నా పేరు చాంద్.. ఈ ఊళ్ళో నన్ను ఎల్. ఐ. సి. లో అసిస్టెంట్‌గా ఎపాయింట్ చేసేరు....ప్రస్తుతం హోటల్‌లో లాడ్జ్ చేసేను.... రూమ్ దొరక్క చాల బాధగా ఉంది ..."

ఆయనకొక ముప్పయి ఏళ్ళుంటాయ్. మనిషి బలంగా అందంగా హుందాగా ఉన్నాడు.... నన్నుచూసి "బ్యాచిలరా ?" అన్నాడు "అవునండీ...." అన్నాను కొంచం విచారిస్తూ.. ఫామిలీకైతే పట్నంలో పోర్షన్ దొరుకుతుంది. . బ్యాచిలర్‌కైతే సాధారణంగా ఏ ఫ్యామిలీవాళ్ళు రూమ్ యివ్వటానికి సాహసించరు.... అది నా దురదృష్టం....

ఆయన వరం యిస్తూన్న దేముడిలా "అదే, ఆ వరండాలో రూంలో ఉండండి.. కరెంటూ, కుళాయీ, అన్ని ఛార్జీలు కలిపి ఇరవయ్ రూపాయలు.... ఇష్టమైతే...." అన్నాడు "సరేనండి... థాంక్స్ ఈ సాయంత్రంవచ్చి దిగుతాను.... ఎడ్వాన్స్ యిమ్మన్నారా ? అడిగేను ఆతృతగా.... రూం దొరికిందన్న సంతోషం కొద్దీ ...

ఆయన కొంచంసీరియస్‌గా "అడ్వాన్స్ అక్కర్లేదు.... మనుషుంమీద.... చదువుకున్నవారిమీద నాకు నమ్మకం యింకా పోలేదులెండి.... సాయంత్రం మీరు వచ్చేవరికి రూం క్లీన్ చేయించుతాను..." అన్నాన.... "థాంక్యూ వెరీమచ్ ...." అంటూ బయటకు నడిచాను....

సాయంత్రం 5 గం॥ సమయాన ఆ రూంలో సామానుసర్దించి హాయిగా ఊపిరి పీల్చుకున్నాను.... రూం ఫరవా లేదు.... అవసరమయితే ఆ ఫామిలీ వాళ్ళతో సంబంధం కల్పించుకోవచ్చు .. లేకపోతే మానేయొచ్చు ... ఏమీ తోచక చలం పుస్తకం తీసేను. ..

"మా అన్నయ్య మిమ్మల్ని పిల్చుకు రమ్మన్నారండీ" అంటూ ఆరేళ్ల కుర్రాడు వచ్చేడు ఎందుకో అనుకుంటూ టవల్ దప్పుకుని నడిచేను.

ఆయన డ్రాయింగ్ రూం.... టేబిల్ పక్క టీపాట్... టేబిల్‌కి నాలుగు వేపులా నాలుగు పేము కుర్చీలు . గోడకి అర్ట్‌పుల్ పిక్చర్స్.. "రండి . కాస్త టీ తీసుకుందురుగాని" అన్నాడాయన.

రిఫ్యూజ్ చేయకూడని అహ్వానం.... మెల్లగా వెళ్ళి ఒక కుర్చీలో కూర్చున్నాను. "నీలూ... త్వరగారా" అన్నారు ఆయన. ఇంతలో ఆమె వచ్చి మెల్లిగా ఆయనకెదురుగ కూర్చుంది.... నాకేవో జ్ఞాపకాలు వస్తూనేయు 'నీలూ' పేరు వినగానే.

ఆమె ముఖం చూడకుండానే టీ తీసుకుంటున్నాను....ఆయన 'నాపేరు మోహన్' ఇక్కడ అసిస్టెంటు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గ ఉంటునాను.. హౌస్ నేనే కొన్నాను. . అద్దెకిచ్చే ఉద్దేశం లేకపోయినా మీకోసం నా ఉద్దేశం మార్చుకున్నాను...."

"కృతజ్ఞతాభివందనాలు" అన్నాను తలెత్తి కిత్తిపోటుకి నెత్తురు చుక్కలేదు.... నన్ను చూసిన నీలూకి అంతే ... క్షణంలో తమాయించుకున్నాం.... ఆయన మానాన ఆయన చెప్పుకుపోతునారు.

'ఈమె పేరు నీలాదేవి... నామిసెస్.... బి. ఏ. ఆనర్స్ ఫస్టుక్లాసు.... లేడిస్ క్లబ్ శక్రటరీ....'

రెండు చేతులూ జోడించి "నమస్తే" అన్నాను నీరసంగా.

"ఈయన పేరు చాంద్.... ఎల్.ఐ.సి.లో వర్క్ చేస్తునారు.... మన రూంలో ఉండమన్నాను...." ఆయన అగేరు "నమస్కారం" అంది సహజంగా....

పరిచయాలనంతరం కబుర్లు ప్రారంభమై ఎనిమిది గంటల వేళకి భోజనంతో ఆఖరయేయి. గుడ్ నైట్ చెప్పి రూం తెరచి పక్క వేసేను....

అవి ఇంటర్మీడియట్ చదువుతూన్న రోజులు.. కాలేజీలో మ్యూజిక్ కాంపిటీషన్ అయింది... మగవాళ్లలో నేనూ, ఆడవాళ్ళలో ఆమే ఫస్ట్ వచ్చేం స్టూడెంట్స్ పెద్ద గోల చేయటం ఆరంభించారు. మమ్మల్నిద్దర్నీ కలసి ఒక డ్యూయెట్ పాడమని.... గోల మరీ విపరీతంకాగా తప్పనిసరై పాడేం.... వణకుతూన్న గొంతుకల్లోంచి మరింత అందంగా సాగింది కాబోలుపాట....ఎన్నోకంగ్రాట్స్ నాకూ ఆమెకూ కలిపి... నేచురల్‌గా పరిచయాలారంభమై ప్రేమరూపం పొందేయ్ రెండో సంవత్సరం మధ్యలో.... నీలూది చాల తీవ్రమైన నేచర్.... అంతలోనే సీరియస్‌గా మారుతూండేది... కాలేజీ కుర్రాళ్ళ గోలా, వేళాకోళాలూ సాగి నా మాప్రేమ కూడ వాటితోపాటు సాగింది నిరాటంకంగా.... యూనివర్సిటీ ఎగ్జామినేషన్స్ జరుగుతున్నయ్.... రాత్రి చదువుతూంటే నాన్న వద్దనుంచి ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం వచ్చిందర్జంటుగ రమ్మని.... ఆతృతగ వెళ్ళటానికి నిశ్చయం చేసుకుని నీలూకి చెప్పేందుకు బయలుదేరేను....

పన్నెండు గంటలయింది. నీలూ రూమ్‌లో నారింజపండు రంగు బల్బు జీరో వాట్సది వెల్గుతూంది.... ధైర్యంగా జారబడి తలుపు జేరవేసేను.... నీలూని తాపుదామనుకుంటూ అడుగులు వేసేను....

పల్చని నీలి సిల్కు శారీ.... ఎర్ర జాకట్టూ.... పసిమి దేహం నారింజపండు రంగు కాంతిలో స్నానంచేసి నూతన అందాలు తెచ్చుకున్నయ్.... జుట్టు నల్ల మేఘాల్లా తెల్లని దిండుమీద పాయలుగా పడిఉంది.... చదువుతూ పడుకుంది

కాటోలు.... ముఖంమీద పుస్తకం అలాగే ఆమె ముక్కునీ బుగ్గల్నీ ముద్దు పెట్టుకుంటూంది... మెల్లగా తీసేను.... ఒక్కక్షణం అలాగే ఉండిపోయాను ... చిరుచెమటతో, అలసి భారంగా మూతపడిన కనురెప్పలతో, గులాబీల్లాటి మృదువయిన బుగ్గలతో ఒక్కక్షణం నన్ను కర్తవ్యతా విమూఢుణ్ని చేసింది నీలూ ముఖం ఆ ముఖం చూడగానే ఎందుకో మనసు వశం తప్పింది...

చేతులు మెల్లగా ఆమె జుట్టు మెత్తదనం పరీక్షిస్తూంటే పెదిమలు అప్రయత్నంగా ఆమె బుగ్గలమీదికి.... అంతే ఆమె ఒక్కసారి కనులు విప్పింది. నేను దూరంగా నెట్టివేయబడ్డాను. దెబ్బతిన్న నాగుపాములా ఆమె బుసలు కొట్టింది. అంతకోపంలోనూ ఆమె అందం ఏమాత్రం చెడలేదు. "ఎందుకొచ్చావ్?" అంది కోపంగా ఆమె కోపం చూసి నేను నిరుత్తరుడినయాను. ఆమెకి నా మౌనం మరీ కోపం తెప్పించింది. ఛీ, యింత నీచుడివనుకోలేదు. ప్రేమిస్తున్నావంటే నిజమే అనుకున్నానుకాని నీవూ పశువులా ప్రవర్తిస్తావనుకోలేదు. చనువిచ్చినందుకు అర్ధరాత్రి ఒంటరిగ పడుకుంటే గదిలోకివస్తావూ? అసలు నీమాటలు నమ్మి మోసపోవటం నాదే పొరపాటు. తేనెపూసిన కత్తులూ, వీలయితే ఆడవాళ్ళ కొంపలు కూల్చే మహానుభావులూ మగవాళ్లు అని తెలియచెప్పావ్, ఇక నీముఖం చూడను ప్రేమలూ గీమలూ అన్నీ పేడకలలు.... వేగం బయటికి పో.... "మానాన్న టెలిగ్రాం యిచ్చేరు. రేపే ఊరికి వెళుతున్నా. అందుకే యిలావచ్చేను. నువ్వేమో అపార్థం చేసుకుంటున్నావ్." సగంచచ్చి అన్నాను.

నీలూ నమ్మలేదు.... "బయటికి పో" అంది కోపంగా.... ఆస్థితిలో ఆమెకేం చెప్పినా అర్థమవదని నాకు తెలుసు మౌనంగా బయటకు రావలసి వచ్చింది. తరువాత అయిదేళ్లు గతించాయ్. ఇంటర్ గ్రూప్ పరీక్షలకి మార్చిలో వెళ్లక పోవటాన సెప్టెంబర్‌లో ప్యాసయాను.... బి. ఏ. అయిపోగా ఉద్యోగం సంపాదించేను. అయిదేళ్లక్రితం జరిగిన ఆ సంఘటన కెంత ప్రాధాన్యం ఉండకపోతే యింత వివరంగా యీనాటికీ జ్ఞాపకం ఉంటుంది? తర్వాత నీలూ ఆనర్స్ చదివి, పెళ్లి చేసుకుందేమో ఈయన్ని.... మెల్లగా నిద్రపోయాను. మర్నాటినుంచీ చాలా జాగ్రత్తగ మసలసాగేను. నీలూని చూడటం యిష్టంలేదు .. వీలయినంత కాలం ఆఫీసులోనూ క్లబ్బులోనూ గడిపి ఏరాత్రికో వచ్చి నిశ్శబ్దంగా రూంలో పడుకునే వాణ్ని... మెల్లగా ఒక నెల గడిచింది... ఆ రాత్రి "దిల్ అప్నా ఔర్ ప్రీత్ పరాయీ" చూసి పదిన్నర ప్రాంతంలో రూంకి వచ్చి మంచం మీద వాలేను ఆలోచిస్తూ.

అరగంట గడిచింది ... ఆలోచన సాగిపోతోంది.... రూం తలుపుమీద 'టకి.... టకీ' మని తట్టిన చప్పుడు గాజుల లయా విన్పించాయ్.... అనుకోకుండా తలుపు తీసెను.

అందంగా తయారై ప్రవేశించింది నీలాదేవి.... వస్తూనే "ఏం చంద్రం, చాల కోపంగా ఉన్నావ్ నాపై? అవును లేనేను చేసిన పొరపాటు అంత తీవ్రమైంది. నన్ను క్షమించవూ?.... నువ్వు పరీక్షకు రావేదని తెలిసి వివరాలు సేకరించాను. మీనాన్నగారి టెలిగ్రాం గురించీ, ఆరాత్రి నాకొందరపాటు గురించీ ఎంతగానో చింతించాను. నీ క్షమాపణ కోరుకుందామనుకున్నా, నువ్వు కన్పించలేదు. కాలగర్భంలో అయిదేళ్ళు కలసిపోయాయి. ఈనాడు నువ్వు నన్ను క్షమించలేవూ?" నీలూ ఏడుస్తోంది.

ఆడవాళ్లెంతగా నటించగలరనుకుంటూ "ఆనాటి నా మూర్ఖతికి నువ్వే నన్ను క్షమించు" అన్నాను.

"చచ్చిన పామునింకా కొట్టి సంతోషిస్తూనావా చాంద్? నన్ను క్షమించలేవూ?"

తెల్లబోయాను . నీలూ మనస్ఫూర్తిగ అందామాటలు.... "ఊఁ" అన్నా నేమనడానికీ తోచక.

"నిజంగా నన్ను క్షమించావా చాంద్? నాకు తెలుసు నీహృదయం నవనీతంకంటె మృదువని.." నీలూ కళ్లల్లో తృప్తి గోచరించింది.

"ఇంకా నువ్వు పెళ్లిచేసుకోలేదు? ఎందుకని?" అంటు నాచేతులు రెంటినీ తనచేతులలోకి తీసుకుని మెల్లగా నొక్కింది. సంకోచంగా నాచేతులు లాక్కున్నాను. "చాంద్!" అంద అదోలా.... నేను మాట్లాడలేదు. 'ఆనాడు నిన్నవమానించేను. కాని యీనాడు నీకోసం నేనే వచ్చేను.... ఆయన క్యాంప్ వెళ్ళేరు.... పద అలా గార్డెన్‌లోకి వెళదాం.... వెన్నెల్లో నైట్ క్వీన్ ఎంత అందంగా ఉందో తెలుసా? ప్రియుడికోసం పొంచిఉండే ప్రియురాలిలా....' "నీలూ...." గట్టిగా అరిచేను.

"నువ్వు ఒకరికి భార్యవని మర్చిపోయావా?"

నీలూ నవ్వింది.... "అందుకనే ఇంత ధైర్యంగా...."

"....కాని నాకా ధైర్యమూ, మోసం చేసే బుద్ధీ లేవు.... ఆనాడు నీకోసం ఆశ చెందేనంటే అర్థం ఉంది.... ఈనాడు...."

"ఏం? నీలూ అందం ఆకర్షణా తగ్గిపోయాయా" నీలూ కొంచం కోపంగా అడిగింది....

"హృదయం లోపించింది" అందామనుకుని ... వెళ్ళిపో నీలూ మీ వారిని నేను మోసం చేయలేను.... నాకు హృదయం ఉంది.... ఆనాడు నువ్వు నన్నూ నా ప్రేమనీ శంకించి మగవాళ్లనే క్రూరంగ చిత్రించేవ్.... ఈనాడు నువ్వు వివాహితవయ్యుండీ పరాయి మగవాడి వద్దకు అర్ధరాత్రి ఒంటరిగా వచ్చేవు.... దీన్ని ఆధారం చేసుకుని స్త్రీ జాతి పవిత్రతకి కళంకం ఆపాదించాలా?" నీలూకి పాఠం నేర్పుదామని కృతక కోపం నటిస్తూ అన్నాను.... "నువ్వొట్టి జడుడివి.... నీకేం అర్థంకాదు. అవకాశాన్ని జారవిడుచుకుంటున్నావ్...." అంది.

నీలూ మాటలు వినలేకపోతునాను.... నీలూ ఎంత నీచానికి దిగజారింది!

(తరువాయి 25 వ పేజీలో)

# ఆంధ్ర జాతీయ కళాశాల ఎగ్జిబిషన్

ఆంధ్ర జాతీయ కళాశాల స్వర్ణోత్సవ సందర్భములో ఆగస్టు 1 వ తారీఖు నుంచి 8 వ తారీఖు వరకు జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనము అందర్నీ మిక్కిలి ఆకర్షించింది. ఈ ప్రదర్శనాల్ని చూడడానికి అనేక వేల మంది, బందరు ప్రజలేగాక ఇతర ఊళ్ళ వారుకూడా తీర్థ ప్రజలవలె వచ్చి చూసి వెళ్ళారు. ఈ ప్రదర్శనములోని ఈ క్రింద పేర్కొన్న ముఖ్యమైన అంశములు ప్రజలను బాగా ఆకర్షించాయి.

ఫిజిక్సు శాఖలోని యాన్ కాంతిలో సీతాకోక చిలుకలు మొదలైనవి, కాంతికి వెళ్ళే మనిషివల్లకాని, చెయ్యి అడ్డుపెట్టడం వలనకాని ఆఘాతం ఏర్పడినప్పుడు గంట మ్రోగించే ఫోటో ఎలక్ట్రిక్ సెల్, సీతరాముని ఆకర్షించి, రావణుని అసహ్యించు కొనుట, శ్రీకృష్ణ తులాభారము, కరిగి పోయే మనిషి మొదలైనవి ప్రశంసనీయంగా ఉన్నాయి.

కెమిస్ట్రీ విభాగంలో, మృత్తిక తోటలు (Silila Gardens). లోహపు చెట్లు, అగ్నిపర్వతము, గానంచేసేమంట, బందరు వాస్తవ్యులయిన శ్రీ కంచి శేషగిరిరావు గారిచే క్రొత్తగా కనిపెట్టబడిన రసాయినికంగా పంచదార తయారు చేయు పద్ధతి, అశేషంగా ఆకర్షించాయి.

జంతుశాస్త్ర విభాగంలో కృత్రిమ అరణ్యము, అనేకరకముల సజీవ నిర్జీవ మత్స్యములు పేర్కొనదగినవిగా ఉన్నాయి.

వృక్షశాస్త్ర విభాగములో మాంస భుక్కులగు (Carnivorus Plants) మొక్కలు వివిధ రకముల పుష్పములు చూడతగ్గవిగా ఉన్నాయి.

గణితశాస్త్ర విభాగంలో, మెదడుకు మేతవేసే అనేకమైన చక్కని చిక్కులు ఉన్నాయి.

మానవపరిగతిశాస్త్ర విభాగంలో మానవ పరిగతి, ముఖ్యంగా భారతదేశం పొందుతున్న అభివృద్ధి బాగా చూపెట్టబడింది.

లలితకళ విభాగంలో అడివి బాపిరాజు, వి. కామేశ్వరరావు వంటి పూర్వవిద్యార్థుల చిత్రాలు, శ్రీ వెంకోజీవంటి స్థానిక ఇతర విద్యాసంస్థల ఉపాధ్యాయుల, విద్యార్థుల చిత్రాలు ప్రదర్శింప బడినాయి. సేకరించిన శిల్పాలు దారు శిల్పాలు కూడ ఉత్తమమయినవిగా ఉన్నాయి.

చివరిదైనా, దేనికీ తీసిపోని భాషాశాస్త్ర విభాగం అత్యుత్తమంగా ఉంది. ఇందులో వేదకాలంనుంచి, నేటికాలం వరకు, సంస్కృతంలోగల అపారమైన సాహిత్యపు వివరాలు, ఇతరదేశాలపై దాని ప్రభావము సంస్కృత కవిత్వంలోని నాగబంధ, చక్రబంధ, శరబంధ మొదలైన విశేషాలు సచిత్రంగాను ప్రదర్శించారు. వీరి కృషి ఆ శాఖలో పరిశోధన జరిపేవారికి మిక్కిలి ఉపయోగంగా ఉండగలదు.

వర్క్ షాపు విభాగంలో స్థానికంగా తయారవుతున్న అనేక ఉత్తమ తరహా యంత్రాలను ప్రదర్శించారు.

విశేష వ్యయ ప్రయాసంలో ఆకర్షణీయంగా ఉపయుక్తంగా నిర్వహించబడిన ఈ వైజ్ఞానిక ప్రదర్శనాన్ని ఏర్పరచిన, కళాశాల పాలకవర్గం, అధ్యాపకవర్గం చూపరులను ఎంతో ఓర్పుతో, నేర్పుతో విషయాలను విశదం చేసిన, స్వయం సేవక విద్యార్థి బృందం, ఈ ప్రదర్శనలో తదితర సంబంధంగల తదితరులు విశేషంగా అభినందనీయులు.

—o—

# గీతాలాపం

బ్రోవుమురా ! మురళీ ! నీ
గాన సుధా స్రవంతిలో నను
పరవశ మొందింపుము కృష్ణా ॥బ్రో॥

వెన్నెల రేయిదా వేకువ దాముని
వేణువు వినిపించుము వంశీ !
వాడిన పూవులు ఎండిన యేరును
[illegible] ॥బ్రో॥

అలుడిగి వైరాగ్యము చెందిన
జీవితమ్ములో నుంటినిరా
ఆధ్యాత్మిక చింతనలోగల ఆ
నందము చూపించుము దేవా ! ॥బ్రో॥

రంజితమైన నీ రాగ మాలికల
సమ్మోహన పరచుము దయితో,
సరసమైన నీ తీయని పలుకులతో
సంతసమ్ము చేకూర్చుమురా ! ॥బ్రో॥

రచన : శ్రీ సత్యప్రియ

## ఊహాతీతులు

(20 వ పేజీ తరువాయి)

అయిష్టం సూచించేటట్లు తలతిప్పివేసేను... "ఛీ ! ఉత్తమూర్ఖుడు ?" అని మెల్లిగా గొణుక్కుంటూ కోపంతో పెద్ద పెద్ద అడుగులువేసి బయటకు నడిచింది సీలూ.

మర్నాడే ఆరూమ్ ఖాళీచేసి మళ్ళీ అన్వేషణ అరంభించేను... ఆ రూమూ, సీతో నాకు మాయని గాయాలు కల్పించేయి.. ఆ రూంలో ఉండటం ఏవిధంగానూ బాగా అన్పించలేదు .. పాపం ! అమాయకపు టాఫీసర్‌గారు నా నిష్క్రమణకేం కారణాలూహించు కుంటారో ? బహుశా నన్నొక ఊహాతీతుడిగ చిత్రించు కుంటారేమో !

—o—